## క్లుప్తంగా

### ధరణి దరఖాస్తుల పరిశీలన



పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. ఐదో రోజు బుధవారం కార్యాలయంలో 25 దరఖాస్తులను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 357 దరఖాస్తులు రాగా ఐదు రోజుల్లో 103 దరఖాస్తులను పరిష్కరించామని ఆయన వివరించారు. కార్యాలయంలో పరిష్కారం కానీ వాటిని జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డీటీ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### 'ఏటీఎం' ఏర్పాటుపై హర్షం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏటీఎం సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో బ్యాంక్ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో రోజులుగా మూతపడిన ఏటీఎం సెంటర్‌లో వసతులను సమకూర్చి వినియోగంలోకి తెచ్చామని ఐఓబీ మేనేజర్ రవీందర్‌బాబు తెలిపారు.

### విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం జెడ్పీహెచ్‌లో 10వ తరగతి చదువుతున్న 56మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ తన సొంత ఖర్చులతో ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని, నిర్దేశిత సమయం కంటే ముందుగానే పరీక్ష కేంద్రానికి వెళ్లాలన్నారు. పరీక్షలు ఒత్తి లేకుండా, ప్రశాంతమైన ఏకాగ్రతతో నిర్భయంగా రాయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, లోకారెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామ యువకులు రవి, చందు, కురుమూర్తి, సాయి, జె.కురుమూర్తి, సాయి తదితరులు ఉన్నారు.

### అనంతప్పకు డాక్టరేట్




వనపర్తి టౌన్: గణితావధాని, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రిటైర్డ్ హెడ్‌మాస్టర్ అనంతప్ప యాదవ్ డాక్టరేట్ పట్టా పొందారు. ఈ మేరకు మంగళవారం రవీంద్ర భారతిలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ చైర్మన్ ఇండియన్ నేషనల్ బోర్డు డాక్టర్ హెచ్‌ఆర్ రెహమాన్, బోర్డు సెక్రెటరీ పరమాజిత్ సింఘా చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుటున్నట్లు చెప్పారు. ఎడ్యుకేషనల్, ట్రైనింగ్ విభాగంలో కృషి చేసినందుకు డాక్టరేట్ పొందినట్లు ఆయన తెలిపారు.

### వ్యక్తి అదృశ్యం



కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకులకు చెందిన కావలి ఎర్ర రాములు కుమారుడు ఎర్ర వెంకటేశ్(25) మూడు రోజులుగా కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేష్ కొంత కాలంగా పెయింటర్‌గా పనిచేస్తుండేవాడు. ఇతడికి రెండున్నరేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఇదే క్రమంలో అప్పులు కూడా చేశాడు. ఈనెల 4న ఉదయం ఇంట్లో నుంచి బైక్ తీసుకుని వెళ్లిపోగా.. కుటుంబ సభ్యులు పనికి వెళ్తున్నాడని భావించారు. కానీ సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. మూడు రోజులుగా కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల, స్నేహితుల వద్ద వెతికినా సమాచారం దొరలేదు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కావలి ఎర్ర రాములు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

### నిధులు కేటాయించాలి

కొల్లాపూర్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు డి.శేఖర్, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు బి.దాసులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# మహిళల హక్కుల పరిరక్షణకు కృషి



వీపనగండ్లలో మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ వరలక్ష్మి



శ్రీరంగాపురంలో..



అమరచింతలో మాట్లాడుతున్న నర్మద

అమరచింత: సమాజంలో మహిళ, పురుషులు సమానమే అన్న సత్యాన్ని చాటిచెప్పడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ నర్మద అన్నారు. పట్టణంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపకుడదని తల్లిదండ్రులకు సూచించారు. ఆడపిల్లలను చదివించాలని, ప్రతి కుటుంబంలో స్త్రీ పాత్ర ఎంతో గొప్పదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రభుత్వాలు మహిళలకు పురుషులతో సమానంగా రిజర్వేషన్లు కల్పించాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మహిళల హక్కులను పరిరక్షించినప్పుడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆమె మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో మహిళలు గురుతర బాధ్యతలు నిర్వహించినప్పుడే మహిళల హక్కులు కాపాడొచ్చన్నారు. మహిళా చట్టాలు సక్రమంగా అమలు జరిగినప్పుడే మహిళలకు పూర్తి భద్రత చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు మూఢనమ్మకాలను విడనాడి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. సమాజంలో మహిళలు తల్లిగా, చెల్లిగా, బిడ్డగా, భార్యగా పలు రకాల పాత్రలను నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, మహిళా సంఘ నాయకురాలు ఎల్లమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, నాగేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయి, సువర్ణ, మహేశ్వరి, కమల, ఎల్లమ్మ, హెల్పర్లు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

**మహిళలకు సన్మానం**

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3 లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచరు మంజులారాణి సెంటర్ పరిధి హహిళలను సన్మానించారు. అనంతరం గ్రామస్తులు అంగన్‌వాడీ టీచరును సన్మానించారు. మండలంలోని తాటిపాముల అంగన్‌వాడీ సెంటర్ 2 లో మహిళ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచరు రాజేశ్వరి ఆధ్వర్యంలో సెంటర్ పరిధి మహిళలకు సన్మానించారు. కార్యక్రమంలో శాంతాబాయి, కవిత, కైసర్‌బేగం, రాధ, ఆయాలు లచ్చమ్మ, అంజనమ్మ పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనుల వద్ద వసతులు కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా ఉపాధి పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్‌తండా, రేమద్దుల గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులు, నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు వచ్చే కూలీలు ఎండల దృష్ట్యా ఉదయం వేళల్లో తొందరగా వస్తే మధ్యాహ్నం వేళల్లో తొందరగా ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. పనుల వద్ద తాగునీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. దీంతో పాటు నర్సరీల్లో మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు.



జనుంపల్లిలో..

పెబ్బేరు రూరల్: ఉపాధి హామీ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని ఎంపీడీఓ రవీంద్ర అన్నారు. ఆయన బుధవారం మండలంలోని జనుంపల్లి, మునుగమోనిదిన్నెలో ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. మొక్కలకు రెండు పూటల నీరందించి కాపాడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అక్తర్‌నిసాబేగం, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీఏ నరసింహారెడ్డి, ఈసీ బాలస్వామి, ఎఫ్‌ఏ శ్రీరాములు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ రైతు హక్కులను కాపాడేందుకు తమ సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తున్నామని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏఐకేఎస్ నూతన సభ్యత్వ సమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. యాసంగి సాగులో నీరు లేకుండా ఎండిపోయిన పంటలకు నష్ట పరిహారం అందించాలన్నారు. రైతు ఉద్యమంలో చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వమే బాధ్యత వహించి ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల పరిహారంను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, తిరుపతి, నాగరాజ్, శ్రీకాంత్, రాజశేఖర్, రవి, ముని పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఇరుముడి



అమరచింత: భక్తిశ్రద్ధలతో శివదీక్షను చేపట్టిన మాలధారులు బుధవారం ఇరుముడి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శివ గురుస్వామి కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన శివ మాలధారులు పట్టణ పురవీధుల గుండా శివనామ స్మరణ చేస్తూ పాదయాత్రగా పట్టణ శివారుకు చేరి, వాహనాల్లో శ్రీశైలానికి తరలివెళ్లారు.

## విశ్వవిద్యాలయాలు మేధోసంపత్తి కేంద్రాలు



ఉద్యాన కళాశాల విద్యార్థులతో శాస్త్రవేత్తలు

కొత్తకోట రూరల్: దైనందిన జీవితంలో ప్రతి అంశం ఏదో ఒక మేధోసంపత్తి హక్కుతో ముడిపడి ఉందని.. విశ్వవిద్యాలయాలు మేధోసంపత్తి కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐపీఆర్ సెల్ నోడల్ అధికారి డా. పిడిగం సైదయ్య, ఉద్యాన యూనివర్సిటీ హార్టికల్చర్ డీన్ డా. ఎం.రాజశేఖర్ అన్నారు. పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం 'సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం వెదికే దిశగా పరిశోధనలు సాగించాలని విద్యార్థులు, పరిశోధకులు, ప్రొఫెసర్లకు సూచించారు. తాము శోధిస్తున్న అంశాలను మేధోసంపత్తి హక్కులుగా మార్చేందుకు భౌగోళిక గుర్తింపులు, పేటెంట్లకు అవకాశం ఉన్న ఉద్యాన రకాలు, ఉద్యాన అంశాలపై భవిష్యత్‌లో యూనివర్సిటీ దృష్టి సారిస్తోందన్నారు. భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు, పంటల్లో రైతులు 20 నుంచి 30 శాతం అధికంగా మార్కెట్ ధరలు పొందుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో మరో ఎనిమిది నుంచి పది ఉద్యాన పంటలు భౌగోళిక గుర్తింపునకు అనువుగా ఉన్నాయని రిజల్ట్ గ్రూప్ ఫర్ ఐపీ సంస్థ లీగల్ ఐపీఆర్ హెచ్ సుబఋజిత్ సాహా తెలిపారు. విశ్వవిద్యాలయాలు, రైతులు, ప్రభుత్వం సమష్టిగా ముందుకొస్తే రాష్ట్రం నుంచి అనేక ఉత్పత్తులు భౌగోళిక గుర్తింపులోకి తీసుకురావచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టు సైంటిస్ట్ డా. రాధిక మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాలకు సంబంధించిన పేటెంట్ అంశాలపై ప్రభుత్వం సలహాలు, సూచనలు చేస్తోందని తెలిపారు. అంతకుముందు డా. పిడిగం సైదయ్య రాష్ట్రంలో భౌగోళిక గుర్తింపునకు అర్హత ఉన్న ఉద్యాన పంటలు, వాటి లక్షణాలు, సాగు ప్రాంతాలు, భౌగోళిక పరిస్థితులు తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. షహనాజ్, డా. జె.శ్రీనివాస్, డా. గౌతమి, డా. శంకర్ స్వామి, బి.రాజశేఖర్, డా. బేబిరాణి, డా. ఆర్.పూర్ణిమ మిత్ర, టీచింగ్ అసోసియేట్స్, నాన్ టీచింగ్ స్టాఫ్, సపోర్టింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి భగత్‌సింగ్ నగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, కేతేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం రవికుమార్ సందర్శించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రూనాయక్ ఉన్నారు.


ఖిల్లాఘనపురం: వెంకటాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ ఉషారాణి హాజరై ఉత్తమ బోధన చేసిన వారిని గుర్తించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యుగేంధర్, అలివేలు, శ్వేత, స్వప్న ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు బోధన చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రంగౌడ్, ఈశ్వర్‌గౌడ్, నోడల్ అధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులుగా నరసింహ, రమేష్ ఉన్నారు.

## బీమా చెక్కు అందజేత

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన దొంతనమోని నాగన్న కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ పార్టీ ప్రమాద బీమా రూ. 2 లక్షల చెక్కును బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. దొంతనమోని నాగన్న గ్రామ సమీపంలో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకొని నాలుగు నెలల క్రితం మృతిచెందాడు. మృతుడికి బీఆర్‌ఎస్ పార్టీలో సభ్యత్వం ఉన్నందున ప్రమాద బీమా రూ.రెండు లక్షలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, రవీందర్‌గౌడ్ రామకృష్ణ పాల్గొన్నారు.

# 'అవినీతిపై బహిరంగ విచారణ జరిపించాలి'



వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

అమరచింత: కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చుకుందామని, అందరూ సహకరించాలంటూనే మున్సిపల్ చైర్‌పర్సన్ భారీ అవినీతికి పాల్పడిందని కౌన్సిలర్లు ఆరోపించారు. బుధవారం స్థానిక పుర కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాలుగేళ్లలో చేపట్టిన పనులు, నిధుల వినియోగం, ఖర్చులు, అవినీతికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. పురపాలికకు ఇప్పటి వరకు రూ.18 కోట్లు మంజూరుకాగా.. అందులో కనీసం రూ.9 కోట్ల విలువగల పనులు సైతం చేపట్టలేదని వివరించారు. సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.నాలుగు లక్షలని తీర్మానం చేసి.. ప్రస్తుతం నిర్మించిన నాలుగు మరుగుదొడ్లకు ఒక్కోదానికి రూ.20 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు అందుకున్నారని ఆరోపించారు. సీఎం గ్రాంట్స్ రూ.50 లక్షలతో పది వార్డుల్లో సీసీ రహదారులు వేశామని లెక్కలు, ఎంబీలు చేసుకున్నారని.. కేవలం ఐదో వార్డులో మాత్రమే సీసీ, మురుగు కాల్వలు నిర్మించారన్నారు. సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణానికి రూ.65 లక్షలు డ్రా చేసుకొని ఇప్పటి వరకు డంపింగ్‌యార్డుకు తరలించిన చెత్తను తగులబెడుతున్నారే తప్పా వేరు చేయడం లేదని తెలిపారు. హరితహారం పేరిట ఇప్పటి వరకు రూ.54 లక్షలు ఖర్చు చేసినట్లు ఎంబీలు రాసుకున్నారని.. పట్టణంలో ఎన్ని మొక్కలు నాటారో లెక్కలు లేవని, కేవలం పదుల సంఖ్యలో మొక్కలు కనిపిస్తున్నాయని చెప్పారు. గ్రీన్ బడ్జెట్ నిధులు సైతం స్వాహా చేశారన్నారు. పురపాలికలోని కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాల్లో వదిలేందుకు సుమారు రూ.80 వేల ఖర్చు రాశారని కౌన్సిలర్లు తెలిపారు. వీటితోపాటు కుక్కల నియంత్రణ కోసం వాటికి ఆపరేషన్లు చేసినట్లు బిల్లులు సైతం దండుకున్నారని వీటికి సంబంధించి బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. అవినీతి వ్యవహారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ భర్త నాగభూషణంగౌడ్, అప్పటి కమిషనర్ మహ్మద్ ఖాజా, అకౌంటెంట్లు ప్రధాన సూత్రధారులని.. కౌన్సిల్ తీర్మానం లేకుండానే బిల్లులు డ్రా చేసుకున్నారన్నారు. రెండున్నరేళ్లలో పొక్లెయిన్ వినియోగం కోసం ఏకంగా రూ.68 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటి వరకు 260కిపైగా మున్సిపల్ తీర్మానాలు జరిగాయని సృష్టించారని.. కేవలం 120 తీర్మానాలకు మాత్రం సంతకాలు చేసినట్లు గుర్తున్నాయని వెల్లడించారు. మున్సిపాలిటీలో మరెన్నో అక్రమాలు జరిగాయని.. త్వరలోనే ప్రజలకు వివరిస్తామని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, విజయరాములు, లావణ్య, సింధు, ఉషారాణి పాల్గొన్నారు.

# కుట్టు కూలి రూ.150 ఇవ్వాలి



మాట్లాడుతున్న డీపీఎం ప్రభాకర్

పాన్‌గల్: విద్యార్థుల స్కూల్ డ్రస్సులు కుట్టేందుకు జతకు రూ.150 ఇస్తేనే కుడతామని మహిళా సమాఖ్యలో సభ్యులుగా ఉన్న దర్జీలు అధికారులకు సూచించారు. విద్యార్థుల స్కూల్ డ్రస్సులు కుట్టే విషయంపై బుధవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా దర్జీలతో సమాఖ్య అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి స్కూల్ డ్రస్సులు కుట్టడంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల స్కూల్ డ్రస్సులు కుట్టే విషయంలో సామగ్రి, కుట్టడం మొత్తం కలిపి జతకు రూ. 50 ఇస్తామని అధికారులు చెప్పడంతో ఆ కూలీ తమకు గిట్టుబాటు కాదని మహిళలు స్పష్టం చేశారు. ఈ విషయంపై ఐకేపీ డీపీఎం ప్రభాకర్ మాట్లాడుతూ స్కూల్ డ్రస్సుల కుట్టు కూలీపై జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం సక్రూనాయక్, సీసీలు నాగరాజు, స్వామి, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఝాన్సీబాయి

పాన్‌గల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఝాన్సీబాయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్ల లోపు వయస్సు గల బాలికలకు చదువు మాన్పించి బాల్య వివాహం చేసినా, బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు. చిన్న వయస్సులో వివాహాల చేయడం వల్ల జరిగే నష్టాలు, విద్య యొక్క ప్రాముఖ్యత, మంచి స్పర్శ, చెడు స్పర్శ, బాలల కోసం ఏర్పాటు చేసిన అత్యవసర చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112, 100 పై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు, సోషల్ వర్కర్ నరేందర్, కేజీబీవీ ఎస్‌ఓ హేమలత, బాలికలు పాల్గొన్నారు.

# ప్రజాదీవెన సభకు తరలిన నాయకులు



బద్రోద్దీన్‌షావలి దర్గా వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఆదివారం నుంచి జరుగుతున్న ఈదమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరకు వచ్చిన భక్తులతో మాట్లాడారు. అనంతరం తిర్మలాయపల్లి శివారులోని బద్రోద్దీన్ షావలి దర్గా వద్ద పూజలు చేశారు. అక్కడి నుంచి నేరుగా మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న ప్రజాదీవెన సభకు ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డి వస్తుండటంతో నాయకులతో కలిసి తరలివెళ్లారు. ఆయన వెంట రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌గౌడు, ప్రకాష్, నర్సింహారెడ్డి, వెంకట్రాములు, అజీమ్ తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: పాలమూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా దీవెన సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ప్రజాదీవెన సభకు ఆత్మకూర్ మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, శ్రీను, సాయి రాఘవ, నాగేష్, దాము, మహేష్, అశోక్, అజ్మతుల్లా, గంగ, షబ్బీర్, చిరంజీవి ఉన్నారు.

## 'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దుల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కిష్టాపూర్‌తండాలో ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై పలు సూచనలు, సలహాలు అందించారు. పబ్లిక్ పరీక్షలను భయం లేకుండా రాయాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని సూచించారు.

# మహిళల అభ్యున్నతే మోదీ లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

వనపర్తిటౌన్: పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ పని చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన శక్తివందన్ అభినందన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి పదేళ్లలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు 11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించారని చెప్పారు. పీఎం ఉజ్వల యోజన కింద 10 కోట్ల కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు, 2029 వరకు ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్నారని తెలిపారు. 50 కోట్ల మంది మహిళలకు జీరో ఖాతాలు తెరిపించారని, నాలుగు కోట్ల మంది మహిళలకు పీఎం అవాస్ యోజన కింద పక్కా ఇళ్లు నిర్మించి గృహ ప్రవేశం చేయించారని గుర్తుచేశారు. పీఎం సుకన్య సమృద్ధి యోజనతో ఆడపిల్లల జనాభా పెంచారని, జాతీయ హెల్త్‌మిషన్‌తో ఆశ కార్యకర్తల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించి మాత, శిశు మరణాలు తగ్గించారని పేర్కొన్నారు. అనేక పథకాలు అమలు చేసి మహిళ పక్షపాతిగా నిలిచిన ప్రధానికి మహిళలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, మహిళామోర్చా నాయకురాలు జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు సుమిత్రమ్మ, బి.కుమారస్వామి, ఏ.సీతారాములు, జిల్లా అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ పెద్దిరాజు, నాయకులు బచ్చు రాము, వారణాసి కల్పన, మధు, రాజశేఖర్‌గౌడ్, అరవింద్, రాజు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 11వ వార్డు రాంనగర్‌కు చెందిన రాములు యాదవ్ మృతి చెందారు. విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రూ. 5వేల ఆర్థికసాయం పంపించారు. దీంతో కాంగ్రెస్ నాయకుడు లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బ్రహ్మం, జయసుధ మధుగౌడ్ ఉన్నారు.